# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 15-07-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ సేవలను మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు.**
2. **ప్రతి పేదవానికి సన్నబియ్యం అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.**
3. **ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో బీమ్స్ టెక్ సదస్సు ఈరోజు కొనసాగుతుంది.**
4. **స్వచ్ఛ భారత్ పురస్కారాల తరహాలోనే ఆంధ్రప్రదేశ్ లోనూ స్వచ్ఛత అవార్డులు అందజేయనున్నామని మంత్రి పి. నారాయణ తెలిపారు.**
5. **తెలంగాణలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు**

==========================

ప్రజలకు ఉపయోగపడేలా ఆంధ్రప్రదేశ్ ఫైబర్ నెట్ సేవలను మరింత విస్తరించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అధికారులను ఆదేశించారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ఏపీ ఫైబర్ నెట్, ఎక్సైజ్ శాఖలపై సంబంధిత అధికారులతో నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, భారత్‌నెట్‌తో ఏపీ ఫైబర్ నెట్‌ను అనుసంధానించేందుకు 19 వందల కోట్ల రూపాయలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయనుందని తెలిపారు.

--------------------------

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ఢిల్లీలో పర్యటించనున్నారు. ఈ రోజు మధ్యాహ్నం ఢిల్లీ చేరుకోనున్న ముఖ్యమంత్రి పర్యటనలో భాగంగా కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా, కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌లతో పాటు నీతి ఆయోగ్ సభ్యులు వీకే సరస్వత్‌తో సమావేశమవుతారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చిస్తారు. సాయంత్రం ప్రధానమంత్రి ప్రదర్శనశాలలో జరగనున్న మాజీ ప్రధానమంత్రి దివంగత పీవీ నరసింహారావు సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించనున్నారు. ముఖ్యమంత్రి రేపు కూడా ఢిల్లీలో పర్యటించి పలువురు కేంద్ర మంత్రులతో సమావేశమవుతారని అధికారులు తెలిపారు.

--------------------------

ప్రతి పేదవానికి సన్నబియ్యం అందాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అన్నారు. సూర్య పేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గం తిరుమలగిరిలో నిర్వహించిన నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి గత సాయంత్రం పాల్గొని ప్రసంగించారు. రేషన్ కార్డులను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించాలనే లక్ష్యంతో.. నూతన రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియను చేపట్టామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షలకు పైగా కొత్త రేషన్‌కార్డులను అందిచనున్నామని ముఖ్యమంత్రి తెలుపుతూ,

వాయిస్ 26 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ రాష్ట్రాల మధ్య నెలకొన్న జల వివాదాలపై చర్చకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం కావాలని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రేపు ఢిల్లీలో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్ నేతృత్వంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి సమావేశం కావాలని కేంద్రం కోరింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తూ కేంద్ర జల్‌శక్తి శాఖ ప్రకటన విడుదల చేసింది.

---------------------------

సముద్ర వాణిజ్యానికి బంగాళాఖాతాన్ని వ్యూహాత్మకంగా కీలక ప్రాంతంగా మార్చేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నంలో నిన్న ప్రారంభమైన బంగాళాఖాతం ప్రాంతంలో బహుళ రంగాల సాంకేతిక, ఆర్థిక సహకార సదస్సు–'బిమ్స్ టెక్' పోర్టుల సదస్సు ఈ రోజు కూడా కొనసాగనుంది. ఈ సదస్సులో భారత్ సహా బంగ్లాదేశ్, భూటాన్, మయన్మార్, నేపాల్, శ్రీలంక, థాయిలాండ్ దేశాల ప్రతినిధులు పాల్గొంటున్నారు. 'నీలి ఆర్థిక వ్యవస్థ, ఆవిష్కరణ, స్థిరమైన భాగస్వామ్యాలు' శీర్షికతో జరుగుతున్న ఈ సదస్సులో ఈరోజు నిన్న పలు అంశాలపై చేసిన తీర్మానాల ఆమోదంతో పాటు వివిధ దేశాల మధ్య వాణిజ్య, పర్యాటక, వ్యూహాత్మక భాగస్వామ్యాల కోసం అవగాహన ఒప్పందాలు జరగనున్నాయి.

---------------------------

స్వచ్ఛ భారత్ పురస్కారాల తరహాలోనే ఆంధ్రప్రదేశ్ లోనూ స్వచ్ఛత అవార్డులు అందజేయనున్నామని ఆంధ్రప్రదేశ్ పురపాలక శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిన్న సమీక్ష నిర్వహించారు. సమీక్ష అనంతరం సమావేశ వివరాలను మంత్రి పాత్రికేయులకు వివరించారు. స్వచ్ఛ భారత్‌లో అవార్డులు సాధించిన విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థల్లో ఈ నెల 21 తేదీన ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నామని ఈ సందర్భంగా మంత్రి తెలిజేయజేస్తూ,

వాయిస్..30 సెకన్లు

---------------------------

"ఒక జిల్లా ఒక ఉత్పత్తి" పురస్కారాలు వాణిజ్య రంగానికే కాకుండా, స్థానిక పరిశ్రమలకు విశేష ప్రోత్సాహం అందిస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. ఢిల్లీలోని భారత్ మండపంలో ఏర్పాటు చేసిన ఒక జిల్లా ఒక ఉత్పత్తి అవార్డు ప్రదానోత్సవంలో భాగంగా ధర్మవరం చేనేత పట్టు చీరకు గానూ

కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పీయూష్ గోయల్ చేతుల మీదుగా నిన్న ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. అనంతరం ఢిల్లీలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ..

వాయిస్... 31 సెకన్లు

---------------------------

తెలంగాణలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోదని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరు జలాశయం గేట్లు ఎత్తి నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఆయకట్టుకు రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితో నీటిని విడుదల చేశారు. కృష్ణా నదీజలాలు వాడుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. పాలేరు జలాశయంలోని ఎడమ కాల్వ, అండర్ టన్నెల్‌కు మరమ్మతులు చేపట్టి 2 లక్షల 55 వేల ఎకరాలకు సాగునీటిని విడుదల చేశామని చెప్పారు.

---------------------------

ప్రపంచ యువ నైపుణ్యాల దినోత్సవం ఈరోజు నిర్వహిస్తున్నారు. యువతలో నైపుణ్యాలను పెంపొందించి.... వారు సమర్థులైన పారిశ్రామికవేత్తలుగా, ఉద్యోగులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. ఈ సందర్భంగా వివిధ రంగాలకు చెందిన యువత తమ భవిష్యత్ కోసం తగిన ప్రణాళిక రూపొందించే దిశగా కృషి చేస్తారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు ప్రతి ఏటా జూలై 15వ తేదీన ఈ కార్యక్రమం జరుగుతోంది.

---------------------------

పొగాకు రైతులకు నష్టం కలుగకుండా మార్క్ ఫెడ్ ద్వారా చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. గుంటూరులోని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో పొగాకు సాగు ప్రాంతాలైన ప్రకాశం, బాపట్ల, గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్‌లు, వ్యవసాయ, మార్క్ ఫెడ్ ఉన్నతాధికారులతో మంత్రి నిన్న ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు.

---------------------------

ఆండర్సన్ టెండూల్కర్ ట్రోఫీలో భాగంగా భారత్, ఇంగ్లాండ్ జట్ల మధ్య మూడవ టెస్ట్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ 192 పరుగులు చేసి ఆలౌటవ్వగా.. అనంతరం 193 పరుగుల లక్ష్యాన్ని ఛేదించేందుకు బ్యాటింగ్ కి దిగిన భారత జట్టు 170 పరుగులకు ఆలౌటై 22 పరుగుల స్వల్ప తేడాతో ఓడిపోయింది. దీంతో ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్ 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. కాగా నాలుగో టెస్టు ఈ నెల 23న మాంచెస్టర్‌లో మొదలవుతుంది.

---------------------------

దిగువ ట్రోపో ఆవరణలో నైరుతి పశ్చిమ గాలులు వీస్తున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో ఈరోజు తేలిక పాటి నుండి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎమ్. వెంకట్రావు ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్..28 సెకన్లు

మరోవైపు తెలంగాణలోనూ ఈరోజు, రేపు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.

=====================